## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**షాబాద్:** మండల పరిధిలోని హైతాబాద్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజు రోజుకు ఓవర్‌లోడ్ సమస్యలు రాకుండా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చే పనులు చేస్తున్నట్లు చెప్పారు. హైతాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హైతాబాద్, హైతాబాద్ తండా, మద్దూరు, పెద్దవెడు, పెద్దవెడు తండా, దుసరికుంట తండా, అంకిగూడ, దామర్లపల్లి, నాన్‌ధార్‌ఖాపేట్ గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుశీల, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, ప్రియాంక, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

**చేవెళ్ల:** మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప పడిపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో అయ్యప్ప మాలధరించిన స్వాములు ఈ పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ముందుగా గణపతి, సుబ్రహ్మణ్యం, మాలిక పురోత్తమ్మ, మంజుమాత, నాగరాజు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పడిపూజ కార్యక్రమాన్ని చేపట్టి పడిని ముట్టించారు. అయ్యప్ప నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. పూజారి కిరణ్ ఆధ్వర్యంలో ఈ పడిపూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో స్వాములు మనికాంత్‌రెడ్డి, సుమంగల్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కేజీబీవీ రోడ్డును అభివృద్ధి చేయాలి

**కొత్తూరు:** మండల కేంద్రం నుంచి కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌కు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షకీల్ శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. హాస్టల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో రాకపోకల సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా రోడ్డుకిరువైపులా లైట్లు లేని కారణంగా రాత్రిళ్లు చీకట్లు అలుముకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి కేజీబీవీ రోడ్డును అభివృద్ధి చేసి, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని కోరారు.

### నియామకం

**మహేశ్వరం:** మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ శివ నియమితులయ్యారు. శనివారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్లార్ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శివకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నడికూడ శివ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ నిరంతరం పని చేస్తోందన్నారు. ప్రతీ కార్మికుడికి కనీస వేతనం, ప్రభుత్వ అలవెన్సులు అందేవిధంగా కృషి చేస్తానన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నాయకత్వంలో పనిచేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.

# ట్రా‘ఫికర్’



మొయినాబాద్‌లో నడీ రోడ్డులో నిలిపిన ఆర్టీసీ బస్సులు

**మొయినాబాద్‌లో రోజురోజుకు పెరుగుతున్న సమస్య**

- షాపుల ఎదుట చిన్న చిన్న బండికొట్లు ఏర్పాటు
- పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనాలు
- ట్రాఫిక్‌జామ్‌తో అవస్థలు పడుతున్న ప్రయాణికులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

**మొయినాబాద్:** మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండడంతో పాటు ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న షాపుల ఎదుట పార్కింగ్ సరిగా లేదు. దీనికి తోడు షాపుల ఎదుట బండి కొట్లు ఏర్పాటు చేయడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ప్రతి నిత్యం మొయినాబాద్ ప్రధాన చౌరస్తాతో పాటు హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీన్ని పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం, పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

**సరైన పార్కింగ్ లేక..**

మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్య జటిలమైంది. జాతీయ రహదారికి ఇరువైపులా వాణిజ్య సముదాయాలు(షాపులు) ఉన్నాయి. కానీ ఆ షాపుల ఎదుట మాత్రం సరైన పార్కింగ్ స్థలాలు లేవు. షాపుల ఎదుట ఉండే కొద్దిపాటి స్థలాన్ని సైతం యజమానులు చిన్న చిన్న బండి కొట్లు పెట్టడానికి అద్దెకు ఇస్తున్నారు. షాపులకు, బండి కొట్ల వద్దకు వచ్చినవారు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివెళ్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. అదేవిధంగా హిమాయత్‌నగర్ చౌరస్తా నుంచి అజీజ్‌నగర్ చౌరస్తా వరకు హోటళ్లు, గ్రానైట్, టైల్స్ షాపులు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా హోటళ్ల వద్ద వాహనాలకు సరిపడా పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

**అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం..**

వ్యాపార సముదాయాలు, షాపులు, హోటళ్లకు మున్సిపల్ కార్యాలయం నుంచి నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే రెండు నెలల క్రితం వరకు మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలు గ్రామ పంచాయతీలుగా ఉన్నాయి. అప్పట్లో పంచాయతీ అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి పెట్టకుండా మామూళ్లకు ఆశపడి ఇష్టానుసారంగా వదిలేశారు. దీంతో రహదారికి ఇరుపక్కలా ఉన్న షాపులు, వ్యాపార సముదాయాల ఎదుట ఖాళీ స్థలం ఎంత ఉంది. పార్కింగ్ స్థలం ఉందా అనే విషయాలను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో షాపుల ముందు ఉన్న స్థలాన్ని కబ్జాచేసి వాటిలో బండికొట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వారి వద్ద రోజు లెక్క అద్దెలు వసూలు చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. షాపుల ఎదుట అక్రమంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు .

**వీఐపీ రూట్‌గా ప్రకటించినా... మారని పరిస్థితి...**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో హైదరాబాద్–బీజాపూర్ రహదారిని వీఐపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. ముఖ్యమంత్రి కొడంగల్ వెళ్లాలంటే ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. అదే విధంగా శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన నియోజకవర్గం వికారాబాద్‌కు వెళ్లాలనే ఇదే రూట్‌లో వెళ్లాలి. వారంలో రెండు మూడు సార్లు ఆయన వికారాబాద్ వెళ్లి వస్తూ ఉంటారు. అందుకే పోలీసులు వీఐపీ మూమెంట్ రూట్‌గా ప్రకటించారు. కానీ అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు అక్కడ మాత్రం ఫోటోలు తీయడమే పనిగా పెట్టుకున్నారు తప్పా ఎక్కడైనా ట్రాఫిక్ నిలిచిపోతే మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదు.

**నాలుగురోజుల హడావుడి..**

ఇటీవల మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జేబీఐటీ కళాశాల ఎదుట రోడ్డు పక్కన భోజనం చేయడానికి కారు దిగిన ఓ యువకుడిని వెనక నుంచి వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజుల పాటు రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులను ట్రాఫిక్ పోలీసులు వెళ్లగొట్టారు. ఆ తర్వాత మళ్లీ మామూలుగానే మారింది. మరో పక్క మున్సిపల్ కేంద్రంలో రోడ్డును కబ్జా చేస్తున్న షాపుల యజమానులను మాత్రం ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులు సైతం దృష్టిపెట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

**ఖాళీ స్థలాన్ని అద్దెకిస్తున్నారు**

మొయినాబాద్‌లో రోడ్డుకిరువైపులా ఉన్న షాపుల యజమానులు డబ్బులకు కక్కుర్తి పడి షాపుల ఎదుట ఖాళీ స్థలాలను కూడా వదలడంలేదు. పార్కింగ్ స్థలం వదలకుండా ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చి డబ్బులు దండుకుంటున్నారు. షాపులకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపైనే ఆపడంతో వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసు చలాన్లు వేస్తున్నారు. షాపుల ఎదుట ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొట్లను తొలగిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తీరుతుంది.

–వెంకట్‌రెడ్డి, మొయినాబాద్

**సమస్యను పరిష్కరిస్తాం**

మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నాం. రోడ్డుకిరుపక్కలా జూస్ బండ్లు, టీకొట్లు, చాట్‌బండార్, తోపుడు బండ్లు పెడుతున్నారు. షాపుల ఎదుట పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మున్సిపల్ అధికారులతో సైతం ఈ సమస్యపై చర్చించాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

రాజేందర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్

## జర్నలిస్టుల సమస్యలపై పోరాటం

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న పున్నయ్య

**షాద్‌నగర్:** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని నిర్వహిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బసవ పున్నయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మహిళా జర్నలిస్టులకు రాత్రివేళల్లో ప్రభుత్వం రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. సమస్యలు, డిమాండ్ల సాధనకు అందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నరేశ్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మణ్, భరత్, మధుసూదన్, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే!

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- కంచె ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి



కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

**కొత్తూరు:** కంచెలు లేని, రోడ్లు, ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రజలు, మూగజీవాలు బలవుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేయడం లేదు. మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ప్రధాన కూడలీ వద్ద ఓ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ దిమ్మె చాలా కిందకు ఉంది. మూగ జీవాలు, ప్రజలు గమనించకుండా సమీపం నుంచి వెళ్లి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఎత్తు పెంచడంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్




మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

**ఎంఈఓ మనోహర్**

**షాద్‌నగర్‌రూరల్:** విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్ పొందాలని ఎంఈఓ మనోహర్ ఆకాంక్షించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ఏదైనా సాధించాలనే కృషి పట్టుదల ఉంటే విజయతీరాలకు చేరుకుంటారన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి, భయాందోళనకు గురికాకుండా సంసిద్ధులు కావాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పందుగ బాల్‌రాజ్, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్ట పూజ, గంగతెప్ప పూజల్లో పాల్గొన్న భక్తులు

**మొయినాబాద్‌రూరల్:** అమ్డాపూర్ మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూడురోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో భాగంగా శనివారం మొదటిరోజు పుట్టపూజ, గంగతెప్ప కార్యక్రమాలు యాదవులు ఘనంగా నిర్వహించారు. రెండోరోజు ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణం, బోనాల ఊరేగింపు, అగ్ని గుండాలు, సదర్ పట్టాలు, గోలుసు తెంపుట, మహామంగళహారతి నిర్వహిస్తారు. మూడోరోజు సోమవారం స్వామివారికి నైవేద్య సమర్పణతో ఉత్సవాలు ముగియనున్నట్లు యాదవ సంఘం సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశామని, విచ్చేసే భక్తులు స్వామివారి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 13న ఉపాధిహామీ సామాజిక తనిఖీ

**షాబాద్:** ఈ నెల 13న మండలానికి సంబంధించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అపర్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీల్లో, అనుబంధ గ్రామాల్లో సామానిక తనిఖీ 15వ విడత 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.ఇందులో కూలీలకు చెల్లించిన వేతనాలు, పనుల నాణ్యత వివరాలపై షాబాద్‌లోని ఉపాధిహామీ కార్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి అన్ని గ్రామాల అధికారులు, ప్రత్యేకాధికారులు హాజరుకావాలని కోరారు.

## లయన్స్ జిల్లా గవర్నర్‌గా డా.మహేంద్రకుమార్‌రెడ్డి



డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**కందుకూరు:** 320ఏ లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌గా కందుకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ 320ఏ జిల్లా వార్షికోత్సవంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు, ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్, మల్టీపుల్ చైర్మన్ రాజిరెడ్డి, ప్రస్తుత జిల్లా గవర్నర్ డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానించారు. 2007–08లో కందుకూరులో నూతనంగా లయన్స్‌క్లబ్ స్థాపించి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అంచలంచెలుగా ఎదుగుతూ క్లబ్ ద్వారా సమాజంలో వివిధ రకాల సేవలు, వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కాగా నూతనంగా ఎన్నికైన జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు నిజాం పాలనలోని కర్ణాటక ప్రాంతం పరిధిలోని 90 క్లబ్బులకు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి గవర్నర్‌గా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. 18 ఏళ్లుగా కందుకూరు సభ్యులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, కార్యదర్శి టి.జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లుగుప్తా, మాజీ అధ్యక్షులు ఎస్.వెంకటరంగారెడ్డి, బీఆర్ రాంరెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, జి.చెన్నకిషన్‌రెడ్డి, జి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



రమేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్

**మహేశ్వరం:** ఆపదలో ఉన్నవారికి తనవంతుగా ఆర్థిక సాయం అందించి అండగా ఉంటానని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాసుల రమేశ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న శ్రీనివాస్ అతనిని పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు.



మొయినాబాద్: కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



షాబాద్: సర్దార్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ అపర్ణ



శంకర్‌పల్లి: డాక్టర్ రేవతిరెడ్డికి సన్మానిస్తున్న సేవా ఫౌండేషన్ సభ్యులు

## ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ఉద్యోగులు వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులు, సభ్యులను శాలువాలతో సన్మానించి, మెమొంటోలు అందజేశారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొన్నారు. ఓ వైపు కుటుంబ బాధ్యతతో పాటు విభిన్నమైన రంగాల్లో సత్తాచాటుతుండటం అభినందనీయమని వారి సేవలను కొనియాడారు.



షాద్‌నగర్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ నీతాపోలె, మహిళా అధ్యాపకులు



షాద్‌నగర్: సన్మానం పొందిన మహిళా అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ డిపోలో కేక్ కట్‌చేస్తున్న డీఎం ఉష, న్యాయవాది సబియాసుల్తానా



మొయినాబాద్‌రూరల్: డాక్టర్ అనితను సన్మానిస్తున్న కళాశాల మహిళా బృందం



కొత్తూరు: పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీడీఓ అరుంధతి



నందిగామ: మండల కేంద్రంలో..